టీఎస్‌టీపీపీ రెండో యూనిట్ జాతికి అంకితం

- ఆదిలాబాద్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ

జ్యోతినగర్, మార్చి 4: రాష్ట్ర అవసరాల కోసం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో నిర్మించిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్లాంటు పూర్తి కాగా, 800 మెగావాట్ల యూనిట్-2ను సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. విభజన చట్టప్రకారం తెలంగాణకు కేటాయించిన థర్మల్ విద్యుదుత్పత్తిలో ఫేస్-1 కింద ఎన్టీపీసీలో నిర్మించిన 1600 మెగావాట్ల తెలంగాణ ప్రాజెక్టులో మొదటగా గతేడాది 800 మెగావాట్ల ఫస్ట్ యూనిట్ ఉత్పత్తిలోకి వచ్చింది. తాజాగా, మరో 800 మెగావాట్ల రెండో యూనిట్ ఉత్పతిలోకి రావడం, విద్యుత్ కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్ కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సభా వేదిక నుంచే వర్చువల్ విధానంలో యూనిట్-2ను జాతికి అంకితం చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం టౌన్‌షిప్‌లోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయగా, ఉద్యోగులు ఉన్నతాధికారులు, ఎన్టీపీసీ కార్మిక సంఘాల నాయకులు తిలకించారు. కాగా, దక్షణ భారత దేశంలోనే మొదటిసారిగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ రెండు సూపర్ క్రిటికల్ యూనిట్లు 1600(800x2) రూ.10,599 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టును 2016 జనవరి 29న జీరో తేదీతో నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ కరోనా, ఇతర సాంకేతిక లోపాలతో ఆలస్యమైంది. కాగా, ఎట్టకేలకు ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్పత్తిలోకి తీసుకురావడంతో పూర్తిగా 1600 మెగావాట్ల విద్యుత్ స్వరాష్ట్రానికి సమకూరుతున్నది. ఇక విభజన చట్టంలోని ఫేస్-2 కింద చేపట్టనున్న 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లను కూడా స్థానికంగానే రూ.26,952 కోట్ల అంచనా వయ్యంతో అంతర్గంతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవలే ప్రాజెక్టు కోసం మట్టి నమూనా పరీక్షలు జరిగాయి. ప్రాజెక్టుకు కావాల్సిన పర్యావరణ అనుమతులు, భూసేకరణ, ఇతర పనులపై బ్లూప్రింట్ కూడా సిద్ధం చేశారు. పనులు ముందుకు సాగడం కోసం ప్రధానంగా విద్యుత్ కొనుగోలుపై ప్రభుత్వాలతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) ఒప్పందం కావడమే ఆలస్యం.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

రామగిరి, మార్చి 4: మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఒకేరోజు కుక్కల దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన విధితమే. వీరిలో రెండేళ్ల వయసుగల చిన్నారి మహావీర్ చౌహాన్ తలకు, కళ్లకు బలమైన గాయాలయ్యాయి. ఇప్పటికే చికిత్స కోసం రూ.3లక్షల వరకు ఖర్చు చేశారు. బాబు తండ్రి సెంటినరీకాలనీలోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించకపోవడంతో మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డికి స్థానికులు అతని పరిస్థితి వివరించారు. స్పందించిన ఆయన బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. బాబు పరిస్థితిని పలువురికి చెప్పగా కుందారపు సంతోష్ తనవంతుగా రూ.5వేలు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. మాజీ జడ్పీటీసీతో అతని ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మేకల మారుతి, కళాధర్‌రెడ్డి, తీగల శ్రీధర్, మల్లేశ్, మల్లయ్య, కనకయ్య, రాజు, సది, కనకరాజ్ తదితరులు ఉన్నారు.

కోరం లేక సహకార సంఘం సమావేశం వాయిదా

ముత్తారం, మార్చి 4: ఇటీవలే అవిశ్వాసం నెగ్గి, సింగిల్ విండో చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అల్లాడి యాదగిరిరావు ఏర్పాటు చేసిన తొలి సమావేశం కోరం లేక వాయిదాపడింది. పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి చైర్మన్‌తో పాటు ఆరుగురు డైరెక్టర్లు హాజరు కావాల్సి ఉండగా, కేవలం చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు డైరెక్టర్లు మాత్రే సమావేశానికి వచ్చారు. చైర్మన్‌గా ఎన్నికైన కేవలం పది రోజుల వ్యవధిలో ఏర్పాటు చేసిన 10 సమావేశానికి డైరెక్టర్లు రాకపోవడంతో నూతన చైర్మన్ కు ఆదిలోనే భంగపాటు జరిగిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సంఘం సీఈవో దాసరి ప్రసాద్ తెలిపారు.

సంక్షేమ ఫలాలు అర్హులకు చేరాలి

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- ఎన్టీపీసీలో జిల్లా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

జ్యోతినగర్, మార్చి 4: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కోరారు. ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ మాట్లాడారు. నూతనంగా ప్రభుత్వం ప్రారంభించిన రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అర్హులకు చేర్చాలన్నారు. మిషన్ భగీరథ, వ్యవసాయం, సంక్షేమం, సాగునీరు, మైనింగ్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలపై చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ సూచించారు. ఎస్సారెస్పీ డీ 83, డీ 86 కాలువల కింద చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు అందించాలన్నారు. రైతుల పొలాలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అక్రమంగా తరలించిన ఇసుక రవాణాపై సీసీ కెమెరాల ద్వారా వివరాలు సేకరించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీ పథకంలో ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే దాకా, డీడీలు చెల్లించి యూనిట్లు రానివారికి డీడీ సొమ్ము తిరిగి చెల్లించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పంచాయతీల్లో ఉపాధి పనులు నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకొని అవసరమైన ఇండ్లకు కొత్త నల్లా కనెక్షన్లు అందించాలనారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ సీఈవో కే నరేందర్, జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

సుల్తానాబాద్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు



మంథని : దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

మంథని, మార్చి 4: ప్రజాపాలన సేవా కేంద్రాలను మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం గతంలో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించిన సమయంలో ఏదైనా తప్పులు ఉంటే సరిచేసుకోవడంతో పాటు కొత్త దరఖాస్తులు కూడా తీసుకుంటున్నామని వివరించారు. తమ కార్యాలయంలోని కౌంటర్‌లో 10 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ఎంపీపీ కొండా శంకర్ సందర్శించారు. ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఒక వార్డు అధికారి, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

నిరంతరం దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్, మార్చి 4 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చేందుకు మున్సిపల్ కార్యాలయంలో నిరంతరం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు తెలిపారు. కార్యాలయంలో ప్రత్యేక దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ కట్ల వేణుమాదవ్, కౌన్సిలర్లు పసెడ్ల మమతసంపత్, చింతల రాజు, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, సిబ్బంది తదితరులున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

రామగిరి, మార్చి 4: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య, జడ్పీటీసీ శారద, ఎంపీడీవో శైలజారాణి కలిసి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి

పెద్దపల్లి, మార్చి4: ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి తర్వగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు తమ చాంబర్లలో వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మహిళ లకు ఆటల పోటీలు

గోదావరిఖని, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మీ శ్రీనివాస్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఈనెల 7న సేవా భవన్‌లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సేవా కో-ఆర్డినేటింగ్ సారంగపాణి, సూపర్‌వైజర్లు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏలో..

రామగిరి, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సీఎన్‌సీవోఏ లేడీస్ క్లబ్ లో ఆటల పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎన్ అలివేణి సుధాకర్ రావు, కే విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు పోటీల్లో పాల్గొనడంపై అభినందించారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గీతారాణి, సభ్యులు హారిని, ప్రసన్న, లావణ్య, నిఖిత, కోమలి పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం

కోల్‌సిటీ, మార్చి 4: ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడె మద్దెల దినేశ్ ఆధ్వర్యంలో 33వ డివిజన్‌లో సోమవారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరయ్యారు. వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులు, సిబ్బందితో పాటు డివిజన్‌లోని పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో సింగరేణి ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, డా.స్వప్న, మేదరి శ్రీనివాస్, పెర్క శ్రీనివాస్,రాజేశ్వరరావు, రవి, గోసిక నరేశ్, శనిగరపు ప్రసాద్, పోలు కిరణ్, నరేంద్ర, సురేంద్ర, రమేశ్, ఆకాశ్, రామస్వామి, రోజా, శ్రీలత, లలిత పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

పెద్దపల్లి టౌన్, మార్చి 4: పెద్దపల్లి సబ్-డివిజన్ పరిధిలోని ప్రజల సౌక ర్యార్థం డివిజనల్ పోస్టల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు సెంటర్‌ను డివిజన్ సూపరిండెంట్ వీ ప్రభాకర్ ప్రారంభించారు. పలువురికి అప్‌డేట్ పత్రాలను అందించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యా న్ని వినియోగించుకోవాలని కోరారు. ఇక్కడ పోస్టల్ ఏఎస్‌పీ సునిల్, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ నరేశ్‌కుమార్, ఉద్యోగులు కొమురయ్య, వికాస్ పాల్గొన్నారు.

ఓదెల మల్లన్నకు సీఐ పూజలు

ఓదెల, మార్చి 4: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయాన్ని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి సోమవారం దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి సీఐకి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ చరిత్రను వేదపండితులను సీఐ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి ఉన్నారు.

'పాత కమిటీతోనే ఉత్సవాల నిర్వహణ'

ధర్మారం,మార్చి 4: నంది మేడారంలోని శ్రీ అమరేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పాత కమిటీ ద్వారానే నిర్వహిస్తామని గ్రామస్తులు, పాత ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆదివారం గ్రామంలో ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. దీంతో ఆ కమిటీని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు కొందరు పాత ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల చిన్న లచ్చయ్య ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల తర్వాత కొత్త కమిటీని ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తుందని పాత కమిటీ చైర్మన్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల తర్వాత ఆలయానికి సంబంధించిన లెక్కలు పూర్తిచేసి కొత్త కమిటీకి అప్పగిస్తామని ఆయన వివరించారు.

ఫారెస్ట్ అధికారులకు నెమలి అప్పగింత

ధర్మారం,మార్చి 4: బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు దేవి వంశీ కృష్ణ నెమలిని కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. మండల కేంద్రంలోని మల్లన్న దేవుడి గుట్ట నుంచి ఎండపల్లి వెళ్లే రహదారి పక్కన ఉన్న తన పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన వంశీ కృష్ణకు అక్కడ నెమలి కనిపించింది. అది కదలలేని స్థితిలో ఉండడంతో పట్టుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ధర్మారం ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి , ఫారెస్ట్ బీట్ అధికారి స్వాతి వెంటనే వాచర్ గోపులాపురం రాజేందర్‌ను అక్కడికి పంపించారు. వంశీకృష్ణ నెమలిని అతనికి అప్పగించాడు. వాచర్ రాజేందర్ నెమలిని కటికెనపల్లికి తీసుకెళ్లగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వాతి సమక్షంలో ధర్మారం వెటర్నరీ డాక్టర్ అజయ్ కుమార్ చికిత్స చేశారు. అనంతరం నెమలిని ఎఫ్‌బీవో స్వాతి కరీంనగర్‌లోని డీర్ పార్క్‌లో నిర్వాహకులకు అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 4: కళ్యాణ్‌నగర్‌లో ఆదివారం రాత్రి 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఏసీఈ ట్రాలీలో తరలిస్తున్నట్లు సమాచారంతో తనిఖీ చేయగా బ్యాగులలో పీడీఎస్ బియ్యం దొరికినట్లు తెలిపారు. ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మంచిర్యాలకు చెందిన చింతల రాజేందర్, చిప్పకుర్తి ప్రవీణ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని గోదావరిఖని వన్‌టౌన్‌లో అప్పగించారు. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్రీనివాస్, ప్రకాశ్, అఖిలొద్దీన్, మల్లేశ్ ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 4: ఎక్స్‌టర్నల్ జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులను ఏరియా ఇన్‌చార్జి జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఆర్జీ-1,2,3, ఏఎల్‌పీ, భూపాపల్లి ఏరియాలకు చెందిన 22 మందికి ఎంవీటీసీలో ఏర్పాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా అన్ని విభాగాలపై అవగాహన పెంచుకుని సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ)మురళీకృష్ణ, ఇన్‌చార్జి డీజీఎం(ప) ఎస్ అనిల్ కుమార్, ఎంవీటీసీ మేనేజర్ శ్రీరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వాల్ పోస్టర్ విడుదల

ఓదెల, మార్చి 4: మండలంలోనిఉప్పరపల్లి శివగట్టు మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర వాల్ పోస్టర్‌ను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఆలయ అధ్యక్షుడు మ్యాకల వెంకటేశ్, నాయకులు సాయిలు, మెట్టు సమ్మయ్య, చేగొండ మురళీకృష్ణ, హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళ లు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- త్వరలో జిల్లాలో టాస్క్ సెంటర్ ఏర్పాటు
- కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మార్చి4: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో మహిళా సంఘాల్లో కుట్టు శిక్షణ పొందిన నలుగురు మహిళలకు జిల్లా కేంద్రలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి రూ. 25 వేల విలులైన హైస్పీడ్ కుట్టు మిషన్లను కలెక్టర్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధి కి చేయూతనిచ్చిన యూనియన్ బ్యాంక్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లు సీఎస్ఆర్ నిధులతో ప్రజలకు ఉపాధి కల్పించడమే ప్రాధాన్యతాంశంగా కృషి చేస్తున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణకు త్వరలో టాస్క్ సెంటర్‌ను ఏర్పా టు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకే జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల యూనిఫాంలు కుట్టే ఆర్డర్ ఇస్తామని చెప్పారు. అనంతరం ఆర్‌బీఐ ద్వారా జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి తాజ్ బేగ్, ధర్మారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జీ సాత్విక, రాగినేడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కే నందినిలను కలెక్టర్ అభినించారు. వారికి రూ. 2వేల చొప్పున చెక్కులు అందించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం అపర్ణారెడ్డి, ఎల్‌డీఎం వెంకటేష్, డీఆర్డీవో రవీందర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి టౌన్, మార్చి 4: కాపులకు రూ. 5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మున్నూరు కాపు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవయ్యపటేల్ మాట్లాడారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా 40లక్షలు ఉందని, రాష్ట్ర జనాభాలో సగటున 24శాతంగా ఉన్నా గుర్తింపులేక పోవడం చాలా బాధరమన్నారు. రాజకీయ పార్టీలు కాపులను గుర్తించిరాజకీయంగా అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో బలమైన కాపులకు రాజకీయ చైతన్యం రావాలని, ఆ దిశగా కాపులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లుకు సంతాపం తెలిపారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి, నాయకులు ఎలువాక రాజయ్య, ఈర్ల కొమురయ్య, శ్రీనివాస్, మహేందర్, ఆకుల స్వామి వివేక్‌పటేల్, బాలకృష్ణ, తిరుపతి, కిరణ్, దేవేందర్, లచ్చన్న, వెంకన్న, అంజన్న పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

జూలపల్లి, మార్చి 4 : మండల కేంద్రంలో సోమవారం 'స్పందన' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ ఏజీఎం జయప్రకాశ్ అడ్వాన్స్డ్ ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. సంస్థ తరపున 20 రోజులు ఉచితంగా ఐకేపీ మహిళలకు శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీడీవో పద్మజ, యూబీఐ, టీజీబీ బ్యాంక్ మేనేజర్లు సురేశ్, నర్సింగరావు, సంస్థ సీఈవో శోభారాణి, ఐకేపీ సీసీ జ్యోతి, విక్టరీ గార్మెంట్ మేనేజర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ వాణి, ట్రైనర్లు మేడి స్వాతి, సత్య పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ, మార్చి 4: కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు నగరంలోని మున్సిపల్ ఆఫీసు టీ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో చెత్త, చెదారం తొలగించడంతోపాటు రోడ్డు ప్రక్కన బండరాళ్లను తొలగించి ఎత్తు పల్లాలను చదును చేశారు.

ఎస్సారెస్పీ డీ 83 కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందించాలి

బేగంపేట వద్ద డీ- 83 కెనాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రామగిరి, మార్చి 4 : జిల్లాలోని ఎస్సారెస్పీ డీ 83 కాల్వ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువలను సోమవారం సందర్శించారు. సాగునీటి విడుదల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందు గా పెద్దపల్లి మండలం రంగాపూర్, కమాన్‌పూర్ మండ లం గుండారం , రామగిరి మండలం బేగంపేట గ్రామా ల్లో ఉన్న డీ 83 కాలువలను సందర్శించి సాగు నీటి విడుదల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీరు వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగిస్తూ ఆయకట్టుకు సాగునీరు అందిం టచాలన్నారు. గతంలో మంచి ఫలితాలు అందించిన ఉత్తమ పద్ధతులను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. డీ-83 కాల్వ కింద 5వ తడి సాగునీటి విడుదలలో చివరి ఆయకట్టు ప్రాంతాలైన మంథనికి సాగునీరు అందకపోవడంతో మంత్రి చొరవతో మరింత నీరు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సాగునీరు మంథని ప్రాంతానికి చేరిందని, రానున్న 18 గంటల పాటు వ్యవసాయ నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ చివరి ఆయకట్టు వరకు అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రాబోయే రెండు తడులలో సైతం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రైతుల పొలాలు ఎక్కడా కూడా ఎండి పోకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, నీటిపారుదల శాఖ పెద్దపల్లి ,మంథని ఈఈలు బల రామయ్య, శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గొడవలు

కౌసల్య(ఫైల్)

పెద్దపల్లి రూరల్, మార్చి 4: పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కలబోయిన కౌసల్య(45) భర్త చేతిలో హతమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భర్త కొమురయ్య పదునైన ఆయుధంతో నరికి హత్య చేసి అక్కడి నుంచి పారిపోయాడు. కౌసల్య ఇంట్లో అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వెంటనే పోలీసులు, స్థానిక నాయకులకు సమాచారం ఇచ్చారు. కొమురయ్య కొంత కాలంగా గోదావరిఖనిలో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. పొలం పనులు, ఇతర పనుల విషయాల్లో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పంచాయతీలు కూడా జరిగాయి. కొమురయ్య వ్యవహార శైలిలో మార్పు రాకపోవడంతో గోదావరిఖనిలో కౌసల్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంలో సోమవారం సాయంత్రం కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగి ఉంటుందని, పథకం ప్రకారమే కొమురయ్య తన భార్య కౌసల్యను హత్య చే